*కిరీటి మెడలో రెండు పాములు పడ్డాయి. ఒక దానితో ఒకటి పెనవేసుకుని తోకలు ముడిపడ్డాయి ఆ ముడి మరింత గట్టిగా బిగిస్తూ "నువ్విప్పుడు నా బందీవి" అంది గాయత్రి*

నవ్వాడు కిరీటి "నేను నీ బందీనని చెప్ప డానికి నీ జడలతో కట్టిపారెయ్యాలా? నీ ప్రేమ బంధంతో నన్నెప్పుడో నీ బందీగా చేసుకున్నావ్ !'' అన్నాడు.

"మరయితే నన్ను నీ బందీగా ఎప్పుడు చేస్తావ్?'' ముందుకు వంగి తన నుదురుతో అతని ఫాలభాగాన్ని తాటిస్తూ గోముగా అడిగింది గాయత్రి

''నేనే నీ బందీ నయితే ఇక నేను నిన్ను బందీగా చేయడ మేమిటి?'' అర్థంకానట్లు ముఖం పెట్టాడు కిరీటి

"అబ్బ! ఇంత చిన్న విషయంకూడ నీకు అర్థమయి చావదు కదా? నా మెడలోమూడు ముళ్లు ఎప్పుడు వేస్తావని నేనడిగేది?''

చిన్నగా నవ్వాడు కిరీటి. "మూడు ముళ్లు వేయించుకోవాలని నీ కెంత తొందరగా ఉందో నా కంతకన్నా ఎక్కువగానే ఉంది కాని ఏం చెయ్యను? నేనింకా పురుష లక్షణం సంపాదించుకోలేదు కదా? కొన్నాళ్లపాటు మన మిలా దూరంగానే ఉండక తప్పదు''

"ఇప్పుడు మనం దూరంగా ఉన్నా మంటావా? లేదు చాల దగ్గరగా ఉన్నాం చూడు'' అతని మెడచుట్టూ వేసిన త జడల హారంతో అతన్ని మరింత దగ్గరగా లాక్కుంది గాయత్రి

''నేనంటే నీ కెంత ఇష్టం గాయత్రీ! నిజంగా నేను పూర్వజన్మలో పెద్ద పుణ్యమే చేసుకుని ఉంటాను లేకుంటే నన్నింత పిచ్చిగా ప్రేమించే నువ్వు నాకీ జన్మలోదొరికే ప్రాప్తం నాకుండేది కాదేమో!''

''అదిగో! పొగుడుతున్నావ్! బ్రహ్మాం డంగా కాకాపడుతున్నావ్! ఇకనీకు ఉద్యోగం దొరకలేదనే బాధలేదు నీలో ఈ టేలంట్ ఉండగా ఉద్యోగం దొరకడానికి ఇంకాట్టే కాలం పట్టదు నీ పొగడ్తలకు ఉబ్బి తబ్బిబ్బయి ఏ వెర్రి వెంగళప్పో నీకు ఏదో ఒకరోజున ఉద్యోగం ఇచ్చిపారేస్తాడు ఝామ్మని మని ద్దరం పెళ్ళిచేసేసుకుంటాం. కాపురంచేస్తాం పిల్లల్నికంటాం.''

''ఇంకాపు ఆలూచూలూ లేదు అన్నట్లు అప్పుడే పిల్లల్ని కనడందాకా వచ్చింది'' నవ్వాపు కుంటూ అన్నాడు కిరీటి


''నవ్వడం ఆపకు కిరీటీ! ఆ నవ్వే నన్ను పిచ్చిదాన్ని చేసింది నీవెంట పడేట్లుచేసింది''

''నన్ను కాదని తైరు కొట్టడం నువ్వు మొదలెట్టావ్! ఇదేం పనమ్మా!'' వెక్కిరిం చాడు కిరీటి

''అతిశయోక్తికాదు కిరీటి! నువ్వు ఎంత అందంగా నవ్వుతావో నిజంగా నీకు తెలియదు, నీనవ్వులన్నీ నా సొత్తే నన్ను ఒక్క పంతృప్తే చాలునాకు ఎన్ని కష్టాలొచ్చినా బతుకంతా నిశ్చింతగా గడిపెయ్యగలను''

''గాయత్రీ! నేనా నిరుద్యోగిని. చిల్లి గవ్వ ఆస్తికూడ లేనివాడిని నన్ను కాదని మీ వాళ్ళు నీకు మరి ఇంకెవరితోనైనా ముడి పెట్టేస్తే?''

''అసంభవం. కలలోకూడ అలాజరగదు. ఖర్మకాలి ఆ పెళ్ళికొడుక్కి అసలు నవ్వ డమే చేతకాకపోతే? జీవితాంతం ఏడ్వలేక నేను చచ్చిపోతాను. నువ్వు బ్రతుకంతా ఏడ్పించినా నవ్వుతూ గడిపేసి నా బతుకు సార్థకం చేసుకుంటాను నువ్వు లేనిదే నేను బ్రతకలేను కిరీటీ !''




ఆమె మాటల్తో అతని హృదయం పులక రించింది. సహజం తనువంతా ఆదేదో తీయని భావనట. దానికి లోనయింది.

ఎవరో దగ్గారు ఆ దగ్గుతో వాళ్ళీలోకా నికి వచ్చారు పరిసరాలు పరికించి తామున్నది పబ్లిక్ పార్కులో నన్నది గుర్తొచ్చి కాస్తంటే కాస్త సిగ్గుపడ్డారు

సూర్యుడు ఇంటికెళ్ళిపోయి అప్పటికి చాలాసేపయింది. వరుసగా తారలను పలక రిస్తూ చంద్రుడు పరుగెత్తుకు వస్తున్నాడు.

''ఇకనైనా నన్ను బంధవిముక్తుడ్నిచెయ్యి దేవీ!'' తన మెడలోని జడల్ని తొలగిస్తూ అన్నాడు కిరీటి

''ఈ బంధాన్ని తొలగించినంత మాత్రాన

నిన్ను వదిలన్నాననుకుంటున్నావా? జన్మ జన్మలకు నువ్వు నా బందీవే!'' అతని తలపై చిన్నగా మొట్టుతూ తన పొడవైన జడల్ని విసురుగా వెనక్కి విసిరింది గాయత్రి

ఈకథ ఈ విధంగా అట్టే రోజులు గడవలేదు పట్టుమని పదిరోజులు గడవకముందే ఉల్లాసంగా సాగిపోయే ప్రేమాయణం తద్విరుద్ధంగా మారిపోయింది.

అదే పార్కు అదే మనుషులు కాని వాతావరణం పూర్తిగా మారిపోయింది

కిరీటొక పిచ్చివాడు. అతనికి గాయత్రి పిచ్చి అ పిచ్చిలో ఇసుమంతైనా తగ్గలేదు వచ్చిన మార్పల్లా గాయత్రిలోనే పరిస్థితులు విషమించకముందే తనకు జ్ఞానోదయమయిందని ఆమెకు చాల ఆనందంగా ఉంది తనకళ్ళు తెరిపించిన తండ్రిని అభినందించుకోని ఘడియలేదు.

తన కూతురు కిరీటితో పార్కులుపట్టి తిరుగతుందన్న కబురు చెవినపడ్డ రోజునే గాయత్రికి తగు హితబోధ జరిగిపోయింది.

''అమ్మాయ్! సినిమాల ధోరణి, నవలల పోకడ అణుఅణువున జీర్ణించుకున్న యువతరం మీది నువ్వు అనుకునేది ప్రేమకాదు నీ కళ్ళకు కప్పిన అందమైన పొర ఏదో ఒక రోజున ఆపొర తొలగక మానదు కాని ఆ పొర తొలగేరోజు నువ్వు చేసేది ఏమీ లేక పశ్చాత్తాపంతో కుమిలిపోయే రోజు కాకూడదని నా ఆకాంక్ష ఒక నిరుద్యోగిని కట్టుకుని నువ్వు బావుకునేది ఏమీ లేదనేది నేను చెప్పే మాటకాదు ఉన్నమాట నీకు పట్టెడన్నం పెట్టేస్థితిలో లేనివాడితో నువ్వు సుఖపడతావనుకునేది వెర్రితనం

పిల్లలనంటూ కన్న తరువాత వాళ్ళ బాగోగులు చూడ్డం, వాళ్ళ భవిష్యత్ తీర్చిదిద్దడం కన్నవాళ్ళ ధర్మం. నా ధర్మాన్ని నేను విస్మరించలేదు అక్కయ్యకు డాక్టర్నిచ్చి పెళ్ళిచేసాను అదిప్పుడు మొగుడితో హాయిగా అమెరికాలో ఉంది నీసంగతి సరేసరి నువ్వు నాముద్దుల కూతురివి నీ జీవితం మూడు పువ్వులు, ఆరు కాయలు కావాలనే నేను కోరుకుంటాను నా ఆశయసిద్ధికోసం ప్రయత్నిస్తాను ఇంతకన్నా నేను నీకు చెప్పదల్చుకున్న దేమీ లేదు నువ్వు నా కూతురివి అర్థం చేసుకోగలవు. నా కా నమ్మకముంది.

నాలుగు రోజుల్లో నిన్ను చూడడానికి పెళ్ళివారొస్తున్నారు. నీ కాబోయే భర్త ఇంజనీరు. కారుంది పెద్ద బంగళా ఉంది ఇతడు కాకపోతే మరో లక్షాధికారికి భార్యవవుతావు అంతేకాని...... అంతే! ఆలోచించుకో!''

గాయత్రి బాగా ఆలోచించుకుంది. ఎంతయినా ఆమె ఆ తండ్రి కూతురు తండ్రి లౌక్యాన్ని కూడ పుణికి పుచ్చుకున్న తెలివైన పిల్ల తండ్రి తన చెడుకోరి చెప్పడంలేదు తను లక్షాధికారిణి అవుతుంది పెళ్ళిచూపుల నాడు పెళ్ళికొడుక్కి తాను నచ్చానని తెలిసినప్పుడు ఆమె గర్వంగా నవ్వుకుంది నచ్చనా? తన అందంమీద ఆమెకు గట్టి నమ్మకం ఏనాడూ ఉంది ఆ క్షణంలో తా ననుక్షణం తపించేపోయే కిరీటి మధుర మందహాసం చాల పేలవంగా ఉంటుందనిపించింది తను చాల అదృష్టవంతురాలు. అదృష్టం తనను వెదుక్కుంటూ వచ్చి వరించింది ఇకపోతే కిరీటి కొద్దిగా డిసప్పాయింట్ అవుతాడేమో? అందుకని తను ..? నో! తనంత ఫూల్ కాదు. తను చేసేది మోసమని ఆమె అనుకోలేదు అడుసులో వెయ్యబోయిన కాలు సకాలంలో వెనక్కి లాక్కోగలిగా ననుకుంది

''నేన్నమ్మను నువ్వు జోక్ చేస్తున్నావు'' అన్నాడు కిరీటి


''టేకిట్ సీరియస్ కిరీటీ! నా పెళ్ళి నిశ్చయమయింది నాకు నీమీద ప్రేముంది కాని ఏం చెయ్యను? ఐకాంట్ హెల్ప్! మా వాళ్ళను కాదని నేను బ్రతకలేను. నువ్వంటే మా నాన్నగారికి సదభిప్రాయం లేదు ఇప్పుడు చెయ్యగలిగేదేమీ లేదు. నన్ను క్షమించు.''

కిరీటికి ఏదో కలగంటున్నట్లుంది. తన కోసం ప్రాణాలిస్తానన్న తన ప్రేమదేవతేనా ఇప్పుడు ముందు నిలిచి హృదయాన్ని తూట్లు తూట్లు చేస్తున్నది? నమ్మలేకపోతున్నాడు. కాని అది కలకాదు. వాస్తవం. నమ్మక తప్పదు. అతని గుండెల్లో మంటలు చెలరేగుతున్నాయ్.

''ఎంత మారిపోయావు గాయత్రీ! తప్పు నీదికాదు నీ ప్రేమ కళంకరహితమని గుడ్డిగా నమ్మడమే నా అపరాధం. నువ్వు డబ్బు మనిషివి నువ్వు మనిషినికాదు విలువ కట్టేది. మనిషి స్థితిగతులకన్నమాట! ఎంతమోసం?'' ఇలాంటి మాటలెన్నో అనాలని అతనికుంది గాని ఒక్కమాట కూడ అనలేదు. వెర్రిగా ఆమెవైపే చూస్తూ ఉండిపోయాడు.

''ఇక నేను వెళ్తాను ఇదే మన చివరి కలయిక'' అతని వెర్రి చూపులు భరించలేక చివాలున వెనుతిరిగింది గాయత్రి. పొడవాటి ఆమె రెండు జడలు లయగా ఊగుతూ అతన్ని వెటకారం చేశాయి. తనెంతో మురిపించే ఆ రెండు జడలు అతనికి ఆ క్షణంలో పాముల్లా కనిపించాయి. నిలువునా విషం నింపుకున్న విషనాగినిలా తోచిందామె.

చావాలనిపిస్తోంది. ఆమె లేని జీవితం





OBM—4493A TEL

WHEN NATURE FAILS

New Super Height మరింతఎత్తు,పొడుగు కాగలరు (2నుండి 8అం. వరకు పూచీ)

For Super Heihtness

మీరూపొడుగు పెరగదలచుకుంటే ప్రపంచప్రఖ్యాతి పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీలు, పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great name and meant for popular people. వెల: బుడ్డి 1 కి (20 Tabs) Rs. 4-75. పోస్టేజి అదనం. 3 Phails (60 Tabs) Rs. 14-25. Postage free.

SCIENCE HAS SOLVED THE PROBLEMS

STOP GREY HAIR పిన్నవారుగా అగుపించండి. మీరు పిన్నవారైనట్లే మీకుఅనిపిస్తుంది. (Feel) Unobtainable anywhere else in the world. సంవత్సరాలుగా జరిపిన పరిశోధన ఫలితమైన బాల్ కాలా తేల్ BAL KALA TEL New Brilliantine Hair Colour అద్భుతముగ తెల్లజుట్టును శాశ్వతంగా నల్లనిదానిగా మార్చివేయబడేట్టు చేస్తుంది. వెల:బుడ్డి 1కి Rs. 4 only. పోస్టేజి అదనం. 3బుడ్లు Rs. 8-80 పోస్టేజి ఉచితం. తల తెల్లగాగాని, రంగువేసినట్లుగాని అగుపించదు. షరా: ఉత్తరాలుఇంగ్లీషులోవ్రాయండి.

**(Correspond in English)**

**M/S. VICTORIA COMMERCIAL COY,**
**A.M.W. (1/76) Flat Door No. 3883X,**
**Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)**


# రెండు జడలు

వృధా. మధువులు చిలికించి తీయనిమాటలతో తనను పరవశింపజేసి చివరికి చిమ్మ చీకటిలో వదిలేసి తన దారిన తాను వెళ్లిపోయింది. తనిప్పై వెల్లువలా కుమ్మరించే ప్రేమంతా ఏమైపోయింది? చేసిన బాసలన్నీ ఏమైపోయాయి? తనేమైపోవాలి? ఏమైపోయినా ఆమెకక్కరలేదా? ప్రపంచంలో మోసపోయిన మొట్టమొదటి మొగాడిలా బాధపడ్డాడు. తన అన్నయ్యలు చాలామంది ఉన్నారని తెలిసినా కొంత ఊరటకలిగేదేమో? బాధతో విలవిలలాడిపోయాడు. విలవిలలాడి కుంగిపోయాడు.

ప్రపంచంలో ముగిసే ప్రేమకథల్లో తొంభైతొమ్మిది శాతం ఈ బాపతేనని ఆ క్షణంలో అతనికి తెలియలేదు. ఎవరూ చెప్పలేదు. చేదు విషంలాంటి నిజాన్ని మింగలేక మరో దారిలేక వంటరిగా ఆ పార్కులో మిగిలిపోయాడు.

* * *

ఎండకాస్తోంది. ప్రపంచాన్ని మలమల మాడ్చేయాలన్న దృఢనిశ్చయంతో సూర్యుడు తీక్షణ దృక్కులు ప్రసరిస్తున్నాడు. ఎండకు మాడుతూ ఆమె యింటిముందే తిష్టవేశాడు కిరీటి. లోపలికి వెళ్లే ధైర్యంలేదు. వెళ్తే ఆమె ఆదరించి మాట్లాడుతుందన్న ఆశకూడా లేదు. ఇంటినిండా వచ్చేపోయే జనం. సందడిగా తిరుగుతున్నారు. ఆ మర్నాడే ఆమె పెళ్లి. సూర్యుడి కోపతాపాలు అతన్నేమీ చేయలేకపోయాయి. నిలుచున్న చోటునుండి అంగుళంమేర కూడ కదలలేదతడు. సూర్యుడు మాత్రం తిరిగి తిరిగి అలసిపోయాడు. ఇంటికి తిరుగు పయనం కట్టాడు.

అప్పుడే ఆమె బయటికి వచ్చింది. కొత్త చీరలో కొత్త శోభతో వెలిగిపోతోంది. చేతిలో ఏవో శుభలేఖలున్నాయి. దేవత ప్రత్యక్షమయినట్లు సంబరపడిపోయాడాతడు.

అతన్ని చూడగానే ముఖం చిట్లించుకుందామె. అంతలోనే నవ్వింది. శుభలేఖ తీసి చేతికిచ్చింది. నవ్వుతూ ఏదో అంది. ఆ మాటలు అతనికి వినబడడం లేదు. గుండెల్ని ఎవరో పట్టి పిండుతున్నట్లుంది.

"ఈ పెళ్ళి చేసుకుని నువ్వు నిజంగా సుఖపడగలవా గాయత్రీ!" దీనంగా అడిగాడు.

"మరేం చెయ్యమంటావ్? ఈ పెళ్ళి మానుకుని నీతో లేచివచ్చేయమంటావా?" ఆమె మాటల్లో వెక్కిరింత తొంగి చూస్తోంది.

"రాలేవా? నాకోసం రాలేవా? నీకోసం ఏమిచెయ్యడానికయినా నేను సిద్ధంగాఉన్నాను"

"నేను సిద్ధంగా లేను."

"మరీ అంత కఠినంగా మాట్లాడకు గాయత్రీ! నేను భరించలేను. మనమిద్దరం కన్నకలలన్నీ చేతులారా ధ్వంసం చేసెయ్యకు. నీలో అంతకర్కశత్వాన్ని నేను చూడలేను".

"హుం...ఏమిటి రోడ్డుమీది డిస్ట్రబెన్సు? పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. నాకవతల చాలా పనుంది. గుడ్‌బై." వెనక్కి తిరిగి చూడకుండ చరచరా వెళ్ళిపోయింది.

"డిస్టబెన్స్" పిడుగులా తోచిందామాట అతనికి. గంటలతరబడి కూర్చుని మాట్లాడినా ఏనాడూ కలగని డిస్టబెన్స్ ఈరోజామెకు కలిగింది.

ఆమెకంత డిస్టబెన్స్ తెలిసి కలిగించినందుకు తనను తాను తిట్టుకున్నాడు. నీరసంగా నవ్వుకున్నాడు.

పెళ్లయిపోయింది. ఆమె పెళ్లయిపోయింది. ఆమె మరొకరి స్వంతమయిపోయింది. కాదు కాదు మరొకరి స్వంతం చేసుకుంది. ఆ రోజంతా పిచ్చివాడిలా తిరిగాడు. పార్కుకు వెళ్లాడు. పార్కులో బెంచీ అతన్ని చూసి నవ్వింది. పార్కు వంత పాడింది. ఏవేవో జ్ఞాపకాలు, మరిచిపోలేని అనుభూతులు అతడ్ని కలచివేస్తున్నాయి.

ఆమె తనను మోసం చేసిందన్న భావంతో అతని మనసంతా ఆమెపట్ల ద్వేషంతో నిండిపోయింది.

ఏదో మత్తుగాఉంది. వళ్ళు తూలుతోంది. కళ్ళముందు ఏవో మసక పొరలు, ఏవేవో వలయాలు.

తానెవరు? ఆమెవరు? ఎందుకీ అర్థంలేని తపన? తన పేరు గుర్తురాలేదతనికి. అతికష్టం మీద తన పేరు కిరీటని గుర్తుకుతెచ్చుకున్నాడు. గుర్తుకు తెచ్చుకోగలిగినందుకు తనను తాను అభినందించుకున్నాడు. నవ్వాడు. మెదడులో నరాలేవో సాగిపోతున్నట్లున్నాయి. మరింతగా నవ్వాడు. చటుక్కున ఏడ్వాలనుకున్నాడు. ఏడుపు రాలేదు. నవ్వడమే బాగుందనుకున్నాడు. మళ్ళీ నవ్వాడు. నవ్వుతుంటే పరమానందంగా ఉందతనికి. నవ్వుతూనే నడుస్తున్నాడు. నడుస్తూనే నవ్వుతున్నాడు.

సెంటర్లో ఆగాడు. నిలబడ్డాడు. వచ్చే పోయే జనాన్ని చూస్తున్నాడు వాళ్ళందర్నీ సవ్వమని అడగాలని ఉంది. ఎదురుగా ఇద్దరు అమ్మాయిలు నిలబడి ఉన్నారు ఒక అమ్మాయికి రెండు జడలున్నాయి, ఆ అమ్మాయి నవ్వు కోంది. ఆ అమ్మాయి నవ్వుతున్నందుకు అతడికి ఆనందంగానే ఉంది కాని ఆ జడలు. కాటు పాములు ... విషసర్పాలు ... మరెవర్నో కాటేస్తాయి ఆ దీనుడ్ని రక్షించాలి ప్రపంచానికి ఘోరమైన విపత్తేదో ముంచుకు వస్తున్నట్లు భయపడ్డాడు కంగారుపడ్డాడు చుట్టూ చూశాడు ప్లాట్ ఫారంమీద ఉప్పు కొట్లవైపు పరుగెత్తాడు

ఆ తరువాత మరింత వేగంగా పరుగెత్తి ఆ పిల్లను చేరుకున్నాడు మరో రెండు క్షణాల్లో ఆమె రెండు జడలు అతని చేతిలో ఉన్నాయి బిగ్గరగా నవ్వుతూ పాముని బాదినట్లు వాటిని నేలకేసి కొట్టాడు. అతని చేతిలోని కొత్త కత్తెర విజయగర్వంతో మెరిసింది ఆ పిల్ల కెవ్వుమంది పక్కనున్న పిల్ల జడపట్టుకుని పరుగెత్తింది.

"నాగినీ! ఇప్పుడు నవ్వు! ఎవరిని కాటు వేద్దామని ఈ పాముల్ని పెంచుతున్నావు? ఇక నీ ఆటకట్టు" అతని కళ్ళు పిచ్చిగా నవ్వుతున్నాయి చుట్టూ జనం చేరుతున్నారు ఇక అతనక్కడలేడు మెరుపులా పరుగెత్తాడు

ఆ రెండు రోజుల్లో అతడు కత్తిరించిన జడలు మొత్తం ఇరవైమూడు పన్నెండు మంది భామలు నూనెలు, అత్తర్లూ రాసి మురిపెంగా పెంచుకున్న కేశసంపద అతని కత్తెరకు ఎరయిపోయింది. ఒక జడ కత్తిరించేలోగానే ఒక పిల్ల అతడ్ని తోసేసి ఒక జడను రక్షించుకొని పారిపోయింది

ఆ తరువాత అతడ్ని పట్టుకున్నారు పట్టుకుని కొట్టారు తన్నారు వళ్ళు హూనం చేశారు కత్తెర లాక్కున్నారు అతడు మరో కత్తెర కొన్నాడు

అంతే! అతడ్ని విశాఖపట్నం పిచ్చాసుపత్రిలో చేర్చారన్నవార్త నిజమేనని రూఢిగా తెలిసేంతవరకు ఆ చుట్టుపక్కల ఆడపిల్లలెవరూ రెండుజడలు వేసుకోలేదు

ఆ తరువాత — కథయిపోయింది.

